సాక్షి
హనుమకొండ
గురువారం | 24 | అక్టోబర్ | 2024



బాలికలు క్రీడల్లోనూ రాణించాలి

బాలికలు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య పేర్కొన్నారు.

- 8లో ▸



ప్రణాళికా బద్ధంగా బస్సులు నడపాలి

ప్రణాళికా బద్ధంగా బస్సులు నడపాలని ఆర్టీసీ కరీంనగర్ ఈడీ, కార్పొరేషన్ కార్యదర్శి పీవీ మునిశేఖర్ అన్నారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
31^0/20^0

వాతావరణం

ఉదయం నుంచి చల్లని వాతావరణం ఉంటుంది. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా జల్లులు కురుస్తాయి. మధ్యాహ్నం సమయంలో సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.

న్యూస్‌రీల్

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

కాజీపేట: తెలంగాణ భవన నిర్మాణ కార్మిక సంక్షేమ మండలి ఆధ్వర్యంలో నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్స్ ద్వారా భవన నిర్మాణ కార్మికుల పిల్లల(నిరుద్యోగ యువత)కు ఉచిత శిక్షణ ఇచ్చేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఏడీ పి.అశోక్ కుమార్ తెలిపారు. కాజీపేటలో బుధవారం ఆయన మాట్లాడుతూ.. విక్టర్ ఐటీఐ ప్రాంగణంలో నిరుద్యోగ యువతకు శిక్షణ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ల్యాండ్ సర్వేయర్ కోర్సు 3 నెలల శిక్షణ, ఇంటర్ ఆపై అర్హత, ఎలక్ట్రికల్ హౌస్ వైరింగ్ 3 నెలలపాటు శిక్షణ, ఐటీఐ లేదా డిప్లొమా అర్హులు. శిక్షణ పొందడానికి ఆసక్తి ఉన్న వారు దరఖాస్తులతో పాటు ఆధార్ కార్డు, విద్యార్హత కలిగిన సర్టిఫికెట్లు సమర్పించాలని సూచించారు. ఇతర వివరాలకు 99636 11239 నంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు.

గవర్నర్‌ను కలిసిన కేయూ వీసీ



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ వీసీ ఆచార్య కె.ప్రతాప్‌రెడ్డి తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా వీసీ ప్రతాప్‌రెడ్డి గవర్నర్‌కు శాలువా కప్పి బొకేను అందజేశారు. ఇదిలా ఉండగా రాష్ట్రంలో వివిధ వర్సిటీలకు నియమితులైన వీసీలతో గవర్నర్ సమావేశం నిర్వహించినట్లు తెలిసింది.

పారామెడికల్ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు

ఎంజీఎం: వివిధ పారా మెడికల్ కోర్సుల్లో అడ్మిషన్లు పొందడానికి అభ్యర్థుల నుంచి ఈనెల 30వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు కాకతీయ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాంకుమార్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు దరఖాస్తులతో పాటు అన్ని సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలతో స్వీయ ధ్రువీకరణతో కేఎంసీలో సమర్పించాలని పేర్కొన్నారు. అప్లికేషన్‌లో తప్పుడు సమాచారం, సంబంధిత సర్టిఫికెట్లు సమర్పిస్తే దరఖాస్తులు తిరస్కరిస్తామని సూచించారు. దరఖాస్తులు, పూర్తి వివరాలకు www.tgpmb.telangana. gov.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని కోరారు.

ఎంజీఎం ఆస్పత్రిలో అధికారుల పరిశీలన



ఎంజీఎం: టీఎస్ ఎంఎస్ఐడీసీ చీఫ్ ఇంజనీర్ దేవేందర్ ఆధ్వర్యంలో ఈఈ ప్రసాద్, డీఈ రాజశేఖర్ బుధవారం సూపరింటెండెంట్ డాక్టర్ మురళితో ఎంజీఎంను పరిశీలించారు. రోగులకు కల్పించాల్సిన సౌకర్యాలపై ప్రత్యేక నివేదికలు తయారు చేశారు. హైదరాబాద్‌లో రెండ్రోజుల క్రితం వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సమీక్ష నిర్వహించారు. ఎంజీఎం ఆస్పత్రిలో కొనసాగుతున్న వైద్యసేవలపై ప్రత్యేకంగా సమీక్షించారు. ఈక్రమంలో ఆస్పత్రిలో భవనాల పరిస్థితి, పరికరాల్లో ఏర్పడుతున్న సాంకేతిక లోపం వంటి అంశాలపై టీఎస్ఎంఎస్ఐడీసీ ఇంజనీరింగ్ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈసందర్భంగా ఎంజీఎం ఆస్పత్రిలో పెచ్చులూడి కింద పడుతున్న కేన్సర్ విభాగ భవనంతో పాటు ఆపరేషన్ థియేటర్లను పరిశీలించారు. అనంతరం సూపర్ ఆస్పత్రిలో ఏసీ మరమ్మతు, సీలింగ్ పనులు పరిశీలించి నివేదికలను ప్రభుత్వానికి అందజేస్తామని అధికారులు తెలిపారు.

చట్టాలకు భిన్నంగా ఆర్టీసీ సర్క్యులర్లు



హన్మకొండ: చట్టాలకు భిన్నంగా టీజీఎస్ ఆర్టీసీ సర్క్యులర్లు జారీ చేస్తూ ఉద్యోగుల జీవితాలతో ఆడుకుంటోందని స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.ఎస్.రావు ధ్వజమెత్తారు. బుధవారం హనుమకొండ రాంనగర్‌లోని సుందరయ్య భవన్‌లో ఏర్పాటు చేసిన ఫెడరేషన్ వరంగల్ రీజియన్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. డ్రైవర్లు మద్యం సేవించడంపై ఉన్న చట్టానికి వ్యతిరేకంగా ఆర్టీసీ యజమాన్యం సర్క్యులర్ విడుదల చేసి నిరంకుశంగా వ్యవహరిస్తోందన్నారు. ఆర్టీసీ డ్రైవర్లపై బ్రీత్ ఎనలైజర్ టెస్టుల పేరిట చేస్తున్న వేధింపులు నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వీరాంజనేయులు, వరంగల్ రీజియన్ అధ్యక్షుడు సి.హెచ్.రాంచందర్, ఎన్.శ్రీనివాస్, వై.శ్రీనివాస్, ఉపేంద్రచారి తదితరులు పాల్గొన్నారు.

ఎలక్ట్రిక్ బస్సెక్కుడే..

- వరంగల్ రీజియన్‌కు 82 బస్సులు
- హనుమకొండ–హైదరాబాద్ మధ్య నడపనున్న యాజమాన్యం..!
- వరంగల్–2 డిపోకు చేరిన డీలక్స్ బస్సు
- కొనసాగుతున్న సబ్‌స్టేషన్, చార్జింగ్ స్టేషన్ నిర్మాణ పనులు
- వచ్చే నెలలో రోడ్లపైకి వచ్చేలా వడివడిగా పనులు



వరంగల్–2 డిపోకు చేరుకున్న ఎలక్ట్రిక్ బస్సు



ఎలక్ట్రిక్ డీలక్స్ బస్సులోని సీట్లు



బస్సులోపల ఏర్పాటు చేసిన సీసీ కెమెరా

హన్మకొండ: నేషనల్ ఎలక్ట్రిక్ బస్ ప్రోగ్రాంలో భాగంగా వరంగల్ రీజియన్‌కు టీజీఎస్ ఆర్టీసీ ఎలక్ట్రిక్ బస్సులు రానున్నాయి. మొదటగా ఢిల్లీకి చెందిన జేబీఎం సంస్థ మంగళవారం రాత్రి ఇక్కడికి ఒక డీలక్స్ బస్సును తీసుకొచ్చింది. దాన్ని వరంగల్–2 డిపోకు తరలించారు. ఈ ఎలక్ట్రిక్ బస్సులను జేబీఎం సంస్థ నడపనుంది. ఈ మేరకు ఆర్టీసీ యాజమాన్యంతో ఒప్పందం చేసుకుంది. కాగా వరంగల్ రీజియన్‌కు మొత్తం 82 ఎలక్ట్రిక్ బస్సులు రానున్నాయి. ఇందులో సూపర్ లగ్జరీ 18, డీలక్స్ 14, సెమీ డీలక్స్ 21, ఎక్స్‌ప్రెస్ 29 బస్సులు ఉన్నాయి. వీటిని ప్రధానంగా హనుమకొండ–హైదరాబాద్ మధ్య నడపాలనే ఆలోచనలో యాజమాన్యం ఉంది.

సెమీ డీలక్స్ బస్సులు కూడా..

కాగా మహాలక్ష్మి పథకంలో భాగంగా రాష్ట్రంలో పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మహిళలకు ఉచిత బస్ ప్రయాణం ప్రభుత్వం కల్పించింది. దీంతో ఆయా బస్సుల్లో ప్రయాణికుల రద్దీ పెరిగింది. ఈ రూట్‌లో పురుష ప్రయాణికులకు ఇబ్బంది కలుగకుండా ఉండేందుకు సెమీ డీలక్స్ బస్సులను ఆర్టీసీ ప్రవేశపెట్టింది. ఈ క్రమంలో ఎలక్ట్రిక్ బస్సుల్లోనూ సెమీ డీలక్స్ బస్సులు ఎక్కువ సంఖ్యలో ఇవ్వాలని యాజమాన్యాన్ని వరంగల్ రీజియన్ అధికారులు కోరారు. కరీంనగర్, నిజామాబాద్ రీజియన్‌కు ఎలక్ట్రిక్ బస్సులు యాజమాన్యం అందిస్తున్నది. ఈ క్రమంలో చార్జింగ్ స్టేషన్లు అందుబాటులో ఉండే హైదరాబాద్‌తోపాటు హనుమకొండ–కరీంనగర్, నిజామాబాద్ రూట్‌లోనూ ఎలక్ట్రిక్ బస్సులు నడిపే అవకాశముంది.

ఆధునిక సదుపాయాలు.. ప్రయోజనాలు

ఈ ఎలక్ట్రిక్ బస్సు డీజిల్ డీలక్స్ బస్సును పోలి ఉంది. సీటింగ్ అదే మోడల్‌లో ఉంది. ఇందులో సీసీ కెమెరా అమర్చారు. ప్రధానంగా మహిళా ప్రయాణికుల రక్షణ నిమిత్తం వీటిని ఏర్పాటు చేసినట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. అలాగే ఆర్టీసీ సిబ్బందిపై ఎవరైనా దాడి చేసినా సీసీ కెమెరాలో రికార్డు అవుతుంది. ఎలక్ట్రిక్ బస్సులతో వాతావరణ కాలుష్యం ఇంధన వ్యయం తగ్గుతుంది. శబ్దం ఉండదు కాబట్టి సౌండ్ పొల్యూషన్ సమస్య లేదు. ఎయిర్ సస్పెన్షన్ ఉండడం ద్వారా ప్రయాణం సుఖవంతంగా ఉంటుంది.

వడివడిగా చార్జింగ్ సెంటర్ల పనులు

ఎలక్ట్రిక్ బస్సులు చార్జింగ్ చేసేందుకు అవసరమైన విద్యుత్ సరఫరా కోసం పనులు వడివడిగా సాగుతున్నాయి. ప్రధాన విద్యుత్ లైన్‌తో పాటు ఏమైనా అంతరాయం కలిగితే విద్యుత్ సరఫరా నిలిచిపోకుండా ప్రత్యామ్నాయంగా మరో లైన్ వేస్తున్నారు. ప్రస్తుతం ఒక విద్యుత్ లైన్ పూర్తయింది. రెండో లైన్ పనులు కొనసాగుతున్నాయి. అదేవిధంగా వరంగల్–2 డిపోలో అవసరమైన విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణం, చార్జింగ్ పాయింట్ల ఏర్పాటు జరుగుతోంది. నవంబర్ రెండు వారం వరకు విద్యుత్ సంబంధిత పనులు పూర్తి చేసి బస్సులను ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకురావడానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

ఒకసారి చార్జింగ్‌తో 300 కిలోమీటర్ల ప్రయాణం

ఈ బస్సు ఒకసారి చార్జింగ్ చేస్తే 300 కిలోమీటర్లు ప్రయాణిస్తుంది. బ్యాటరీ ఫుల్ చార్జింగ్ కావడానికి 2.30 గంటల సమయం పడుతుంది. వచ్చే నెలలో ఎలక్ట్రిక్ బస్సులను రోడ్లపైకి తెచ్చే అవకాశం ఉంది. అప్పటి వరకు ఇందుకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయడానికి చర్యలు చేపట్టాం.

– డి.విజయభాను, వరంగల్ రీజనల్ మేనేజర్

ధాన్యం తేమ శాతాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య



కొనుగోళ్లు సక్రమంగా నిర్వహించాలి

కలెక్టర్ పి.ప్రావీణ్య

కమలాపూర్: ధాన్యం కొనుగోళ్లు సక్రమంగా నిర్వహించాలని హనుమకొండ కలెక్టర్ పి.ప్రావీణ్య అన్నారు. కమలాపూర్ మార్కెట్ యార్డులో ఐకేపీ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె బుధవారం పరిశీలించారు. అక్కడ రైతులు ఆరబోసిన ధాన్యాన్ని అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం కేంద్రం నిర్వహణకు సంబంధించిన రికార్డులను తనిఖీ చేశారు. ఇక్కడ నూతనంగా ఏర్పాటు చేసిన ప్యాడీ క్లీనర్ యంత్రం వినియోగంపై ఆరాతీశారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియకు సంబంధించి అధికారులు, నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల అధికారి ఉమారాణి, డీఆర్‌డీఓ నాగపద్మజ, డీపీఎం ప్రకాష్, తహసీల్దార్ సురేష్, ఎంపీడీఓ బాబు, ఏఓ లక్ష్మారెడ్డి, డీటీసీఎస్‌లు నాగేంద్రప్రసాద్, రమేష్, ఏపీఎం నారాయణ, సీసీ మౌనిక, యాకయ్య తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదు చేసిన వెంటనే కేసు నమోదు చేయండి

సీపీ అంబర్ కిషోర్‌ఝూ



ఫిర్యాదులు పరిశీలిస్తున్న సీపీ అంబర్‌కిషోర్‌ఝూ

ఆత్మకూరు: నేరారోపణలతో వచ్చే ఫిర్యాదులపై స్టేషన్ అధికారులు తక్షణమే కేసులు నమోదు చేయాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్‌ఝూ అన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో ఆయన బుధవారం సందర్శించారు. సీపీకి ఏసీపీ కిషోర్‌కుమార్, సీఐ సంతోశ్ పూలమొక్క అందజేసి స్వాగతం పలికారు. సాయుధ పోలీసుల గౌరవ వందనం స్వీకరించిన అనంతరం సీపీ పోలీస్ సిబ్బంది కోసం మంజూరు చేసిన కిట్ ఆర్టికల్స్‌ను పరిశీలించారు. రిసెప్షన్ సిబ్బంది పని తీరును తెలుసుకున్నారు. వచ్చిన ఫిర్యాదులపై ఎలాంటి చర్యలు తీసుకున్నారో తెలుసుకున్నారు. పెండింగ్ కేసులు, రౌడీ షీటర్ల వివరాలు, రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకుంటున్న చర్యలు, దర్యాప్తు వివరాలను ఏసీపీ కిషోర్‌కుమార్, సీఐ సంతోశ్‌ను అడిగి తెలుసుకున్నారు. స్టేషన్ రికార్డులు పరిశీలించారు. ఈసందర్భంగా సీపీ మాట్లాడుతూ.. పోలీస్‌స్టేషన్‌లో అధికారులు, సిబ్బంది ఫిర్యాదుదారులతో మర్యాదగా ప్రవర్తించాలన్నారు. ఫిర్యాదుదారులకు సమస్య పరిష్కారం అవుతుందనే నమ్మకం కలిగించాలన్నారు. పోలీసు శాఖ కీర్తి ప్రతిష్ఠలకు భంగం కలిగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. తనిఖీలు పూర్తయ్యాక స్టేషన్‌లో సీపీ పండ్ల మొక్క నాటారు. కార్యక్రమంలో వరంగల్ ఈస్ట్ జోన్ డీసీపీ రవీందర్, పరకాల ఏసీపీ కిషోర్‌కుమార్, సీఐ సంతోశ్, ఎస్ఐ పరమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారి పనులు వేగవంతం చేయాలి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి సాంబశివరావు



టిప్పర్ ప్రమాదానికి గురైన స్థలాన్ని పరిశీలిస్తున్న కూనంనేని సాంబశివరావు

ఎల్కతుర్తి: ఎల్కతుర్తి నుంచి రామాయంపేట వరకు జరుగుతున్న జాతీయ రహదారి పనులను వేగవంతం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. బుధవారం భీమదేవరపల్లి మండల కేంద్రంలో జాతీయ రహదారిపై జరుగుతున్న పనులను ఆయన పరిశీలించారు. అదుపుతప్పిన టిప్పర్ ప్రమాదానికి గురైన ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓవర్ లోడ్‌తో వెళ్తున్న టిప్పర్లపై ఆంక్షలు విధించాలన్నారు. సీపీఐ జమిలి ఎన్నికలకు దూరమని, పూర్తిగా వ్యతిరేకమని ఎప్పటిలాగే ఎన్నికలు జరిపించాలన్నారు. ఈవీఎంల ద్వారా కాకుండా బ్యాలెట్ పద్ధతి ద్వారా ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపెల్లి శ్రీనివాస్‌రావు, జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, రాష్ట్ర సమితి సభ్యుడు ఆదరి శ్రీనివాస్, మండల కార్యవర్గ సభ్యులు ఉట్కూరి రాములు, కర్రె లక్ష్మణ్, అనిల్, రమాదేవి, తిరుపతి తదితరులు ఉన్నారు.

పని చేయలేం.. మా జిల్లాకు పంపండి

- డిప్యుటేషన్‌లో చాన్స్ ఇవ్వండి
- మంత్రి, డీఐజీకి వినతుల వెల్లువ

కాజీపేట అర్బన్: 'పక్క జిల్లాలో మేం పని చేయలేకపోతున్నాం. మా జిల్లాకు మేం వస్తాం. మాపై కరుణ చూపండి' అంటూ రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ శాఖలోని జూనియర్, సీనియర్ అసిస్టెంట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలకే పరిమితమైన బదిలీలు ఈసారి బ్యాన్ ఆఫ్ ట్రాన్స్‌ఫర్స్ పేరిట సబ్ రిజిస్ట్రార్ల మాదిరిగా జోనల్ ట్రాన్స్‌ఫర్ నియమాన్ని పాటించిన మాదిరిగా ఉమ్మడి వరంగల్ జిల్లా జూనియర్, సీనియర్ అసిస్టెంట్లను ఉమ్మడి ఖమ్మం జిల్లాకు బదిలీ చేశారు. జూలైలో జూనియర్, సీనియర్ అసిస్టెంట్ల బదిలీలు ప్రభుత్వం చేపట్టగా.. పిల్లల చదువులకు ఇబ్బందులు ఏర్పడతాయనే ఆలోచనలతో ఉద్యోగులు కుటుంబ సభ్యులను వదిలి బదిలీ అయిన స్థానాలకు వెళ్లి రిపోర్టింగ్ చేశారు.

ఒక అవకాశమివ్వండి..

ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి ఉమ్మడి వరంగల్ జిల్లాకు బదిలీ అయిన కొందరు ఉద్యోగులు టీఎస్‌పీఎస్‌కు దరఖాస్తు చేసుకుని రిజల్ట్స్ కోసం వేచి చూస్తున్నారు. కాగా.. బదిలీ అయిన స్థానం నుంచి తిరిగి యథాస్థానానికి డిప్యూటేషన్‌పై వెళ్లారు. ఖమ్మం జిల్లాకు వెళ్లిన సదరు ఉద్యోగులు టీఎస్‌పీఎస్ ఫలితాలు వెలువడేందుకు ఏడాది పట్టే అవకాశం ఉండడంతో తిరిగి వచ్చే అవకాశం కూడా లేకుండా పోలేదు. దీంతో 'వారు మాత్రం యథాస్థానానికి వెళ్లారు.. మేం మాత్రం అక్కడే ఉండిపోయాం.. మాకు డిప్యూటేషన్‌లోనైనా చాన్స్ ఇవ్వండి మా జిల్లాకు మేం వస్తాం' అని వాపోతున్నారు.

మంత్రి, డీఐజీకి వినతుల వెల్లువ

ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా ఉన్న 13 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో సుమారు 14 మంది సీనియర్, 15 మంది జూనియర్ అసిస్టెంట్లు విధులు నిర్వహిస్తుంటారు. కాగా.. ఇటీవల బదిలీల్లో ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి ఉమ్మడి ఖమ్మం జిల్లాకు బదిలీ అయ్యారు. కాగా డైలీ అప్ అండ్ డౌన్ చేసే పరిస్థితి కూడా లేకుండా దూరం అవుతుందని ఇటీవల ఉమ్మడి ఖమ్మం, వరంగల్ జిల్లాల సీనియర్ జూనియర్ అసిస్టెంట్లు రెవెన్యూ శాఖ మంత్రిని, డీఐజీని కలిసి వినతులను సమర్పించినట్లు సమాచారం. కాగా.. తమ బదిలీల్లో కౌన్సెలింగ్ ప్రక్రియను ఏర్పాటు చేయకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సమగ్ర సమాచారం సేకరించాలి

కాళోజీ సెంటర్: ఎలాంటి వివాదాలకు తావు లేకుండా అన్ని వర్గాల ప్రజల సమగ్ర సమాచారం సేకరించాలని బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ సూచించారు. సమగ్ర కుటుంబ సమాచార సేకరణ కోసం హైదరాబాద్ నుంచి బుధవారం ఆయన కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా నిరంజన్ మాట్లాడుతూ నవంబర్ 2న హనుమకొండ కలెక్టర్ కార్యాలయంలో వరంగల్ ఉమ్మడి జిల్లాకు చెందిన వివిధ వర్గాల ప్రజల నుంచి కులగణనపై వినతులు స్వీకరిస్తామని తెలిపారు. కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ అభిప్రాయ సేకరణలో పాల్గొనే విధంగా ప్రజాప్రతినిధులు, మేధావులు, వివిధ కుల సంఘాల నాయకులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో బీసీ సంక్షేమ అధికారి పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

టీఎస్ ఐసెట్ నిధుల దుర్వినియోగం? - 8లో ▸

అసెస్‌మెంట్ల నమోదులో వేగం పెంచండి



మాట్లాడుతున్న కమిషనర్ అశ్విని తానాజీ

వరంగల్: భువన్ యాప్‌తో అసెస్‌మెంట్ల నమోదులో వేగం పెంచాలని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అధికారులను ఆదేశించారు. బుధవారం బల్దియా ప్రధాన కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్లతో భువన్, ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల నమోదు పరిశీలనపై సమీక్షించారు. సమర్థవంతంగా నిర్వహించేందుకు తగు సూచనలు చేశారు. ఈసందర్భంగా భువన్ యాప్‌తో అసెస్‌మెంట్ల నమోదు తీరును ఆన్‌లైన్‌లో పరిశీలించిన అనంతరం కమిషనర్ మాట్లాడుతూ.. ప్రతీ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్(ఆర్ఐ) ప్రతీరోజు 150 దరఖాస్తులు భువన్ ఆప్‌తో నమోదు చేసేలా చూడాలన్నారు. ప్రస్తుతం సుమారు 40 వేల దరఖాస్తులు నమోదు లక్ష్యంగా ఉన్నాయని నిర్దేశిత గడువులోగా పూర్తి చేసేలా డిప్యూటీ కమిషనర్లు పర్యవేక్షించాలని ఆదేశించారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలనలో వేగం పెంచాలని, టీపీఎస్‌లు, వార్డు ఆఫీసర్లు సమన్వయంతో పని చేసి త్వరితగతిన పరిశీలన పూర్తి చేయాలన్నారు. సమావేశంలో డిప్యూటీ కమిషనర్లు కృష్ణారెడ్డి, రవీందర్, ఐటీ మేనేజర్ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ వెంకటరమణ

వరంగల్: రక్తదానం ప్రాణదానంతో సమానమని, యువత ఇతరుల ప్రాణాలను కాపాడడానికి రక్తదానం చేస్తే ఆరోగ్యానికి, సమాజానికి ఎంతో మేలు కలుగుతుందని వరంగల్ డీఎంహెచ్‌ఓ కె.వెంకటరమణ అన్నారు. మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు జన్మదినం సందర్భంగా డీఎంహెచ్‌ఓ ఆధ్వర్యంలో వరంగల్ ఎస్వీ కన్వెన్షన్ హాల్‌లో బుధవారం రక్తదానం, ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ రెడ్‌క్రాస్ సొసైటీ ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో ప్రజలు ముందుకు వచ్చి రక్తదానం చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. అనారోగ్య సమస్యలు ఉన్న వారికి ఉచితంగా అవగాహన కల్పించి, చికిత్స అందించినట్లు తెలిపారు. శిబిరంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్.గోపాల్‌రావు, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ మోహన్‌సింగ్, ఎంజీఎం పీపీ యూనిట్ డాక్టర్ ఎం.యశస్విని, పల్లె దవాఖాన డాక్టర్లు, డిప్యూటీ డెమో అనిల్‌కుమార్, ఆరోగ్య పర్యవేక్షకురాలు నర్మద, జాతీయ ఆరోగ్య మిషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేశ్‌ఖన్నా పాల్గొన్నారు.

ముగ్గురు ఎస్సైల బదిలీ

వరంగల్ క్రైం: వరంగల్ కమిషనరేట్ పరిధి ముగ్గురు ఎస్సైలను బదిలీ చేస్తూ వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎ.శ్వేత తరిగొప్పుల నుంచి సీసీఆర్‌బీ, ఎం.రాజేందర్, ఎ.ప్రవీణ్‌కుమార్‌ను కేయూసీ నుంచి సీసీఆర్‌బీ బదిలీ చేస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

కమీషన్.. పర్మిషన్!

బాణసంచా విక్రయాలకు దళారుల బెడద

- అనుమతుల కోసం ఒక్కో దుకాణం నుంచి రూ.50 వేల వరకు వసూలు
- గ్రేటర్ వరంగల్‌లో యథేచ్ఛగా దందా



సాక్షిప్రతినిధి, వరంగల్:

దీపావళి టపాసుల వ్యాపారానికి దళారుల బెడద షరా 'మామూలు'గా మారింది. హనుమకొండ, వరంగల్, కాజీపేట ప్రాంతాల్లో దుకాణాల నిర్వహణకు అనుమతుల పేరిట కొందరు దళారులు పెద్ద ఎత్తున వసూళ్లకు దిగారు. అనుమతులు మొదలు దుకాణం ఏర్పాటు వరకు అన్నీ తామే చూసుకుంటామని ఒక్కొక్కరి నుంచి రూ.40 వేల నుంచి రూ.50 వేల వరకు వసూలు చేస్తున్నట్లు తెలిసింది. ఈ దందా వెనుక గ్రేటర్ వరంగల్‌కు చెందిన ముగ్గు రు ద్వితీయశ్రేణి నాయకులు ఉన్నట్లు చర్చజరుగుతోంది. ఇప్పటికే సదరు నాయకులు వ్యాపారులతో సమావేశమై ఒప్పందం చేసు కున్నట్లు తెలుస్తోంది. గతంలో బీఆర్ఎస్ హయాంలో చక్రం తిప్పిన వారే.. ఈసారి కూడా కీలకంగా వ్యవహరిస్తుండడం కాంగ్రెస్ వర్గాల్లో చర్చనీయాంశం అవుతోంది.

'పేలనున్న' ధరలు..

దీపావళి దుకాణాల ఏర్పాటుకు దళారులు అడ్డగోలుగా వసూలు చేస్తుండగా.. పోలీసు, రెవెన్యూ, వాణిజ్య పన్నులు, అగ్నిమాపక తదితర శాఖలకు ఖర్చులు 'మామూలే' నంటున్నారు. మూడు రోజుల భాగోతానికి ఒక్కో దుకాణానికి రూ.50వేలకు పైగా ఖర్చు చేయాల్సి వస్తుందని నిర్వాహకులు వాపోతున్నారు. ఈనేపథ్యంలో దుకాణాల ఏర్పాటు, రవాణా చార్జీలు, మామూళ్ల వ్యాపారులకు తడిసి మోపెడు కానుండగా.. టపాసుల ధరలు ఈసారి పేలనున్నట్లు చెబుతున్నారు. గ్రేటర్ వరంగల్‌లో ప్రతి ఏటా సుమారు రూ.100 కోట్లకు పైగా విలువైన టపాసుల అమ్మకాలు జరగనుండగా.. ఆ భారమంతా వినియోగదారులపైనే పడనుందన్న చర్చ జరుగుతోంది.

అనుమతులు, సౌకర్యాల పేరిట వసూళ్లు..

దీపావళి వేళ ఏటా ట్రైసిటీలో పెద్ద ఎత్తున టపాసుల దుకాణాలు ఏర్పాటు చేస్తుంటారు. పదేళ్లుగా బీఆర్ఎస్ కార్పొరేటర్లు, ద్వితీయశ్రేణి నాయకులు వ్యాపారుల వద్ద డబ్బులు తీసుకొని నడిపించారు. ఒక్కో దుకాణం ఏర్పాటుకు రూ.25 వేల నుంచి రూ.30వేల వరకు ఖర్చయితే.. రూ.8వేల నుంచి రూ.10 వేలు అదనంగా వసూలు చేశారు. కొందరు కార్పొరేటర్లు గ్రేటర్ వరంగల్‌లో 110 నుంచి 120 దుకాణాలు ఏర్పాటు చేసినా.. సగం షాపులకే ట్రేడ్ లైసెన్సు డబ్బు కార్పొరేషన్‌కు చెల్లించారనే ఆరోపణలున్నాయి. ఈ ఏడాది కూడా హనుమకొండ హయగ్రీవాచారి గ్రౌండ్, వరంగల్, కాజీపేటలో 100కు తగ్గకుండా దుకాణాల ఏర్పాటుకు సిద్ధం కాగా.. రూ.38 వేల నుంచి రూ.50వేల వరకు వసూలు చేస్తున్నట్లు సమాచారం. ఇదేమిటని అడిగితే ఒక్కో షాపు పేరున అగ్నిమాపక, రెవెన్యూశాఖలు, కార్పొరేషన్, జీఎస్టీలకు రూ.2,200 వరకు చెల్లించాలని, విద్యుత్, నీరు, ఇతరత్రా సరఫరాకు రూ.4వేల వరకు అవుతుందని లెక్కలు చెబుతున్నట్లు తెలిసింది. అలాగే తాత్కాలిక దుకాణాల ఏర్పాటు పేరిట ఒక్కొక్కరి నుంచి రూ.10వేల నుంచి రూ.15వేల వరకు వసూలు చేస్తున్నట్లు పలువురు బాధితులు తెలిపారు.

క్లుప్తంగా

నేడు కోణార్క్, హౌరా రైళ్లు రద్దు

కాజీపేట రూరల్: కాజీపేట జంక్షన్ మీదుగా ప్రయాణించే కోణార్క్, హౌరా ఎక్స్‌ప్రెస్‌లు వర్షాల కారణంగా గురువారం రద్దు అయినట్లు రైల్వే అధికారులు బుధవారం తెలిపారు. భువనేశ్వర్–ముంబాయి కోణార్క్ ఎక్స్‌ప్రెస్, హౌరా–హైదరాబాద్ (185046) హౌరా ఎక్స్‌ప్రెస్ రద్దు అయినట్లు రైల్వే అధికారులు తెలిపారు.

వనదేవతల ఆదాయం రూ.26,81,640

మేడారం హుండీ కానుకలు లెక్కింపు

ఎస్ఎస్‌తాడ్వాయి: మేడారం సమ్మక్క– సారలమ్మల హుండీల కానుకలను బుధవారం దేవాదాయశాఖ అధికారులు లెక్కించారు. మేడారంలోని డార్మెటరీ భవనంలో పూజారుల సమక్షంలో హుండీల కానుకలను లెక్కించారు. సమ్మక్క హుండీ ఆదాయం రూ. 13,85,398, సారలమ్మ ఆదాయం రూ. 12, 09,392, పగిడిద్దరాజు ఆదాయం రూ. 47, 331, గోవింద రాజుల ఆదాయం రూ. 39, 519.. మొత్తం రూ.26,81,640 లక్షల ఆదాయం వచ్చినట్లు ఈఓ రాజేంద్రం తెలిపారు. గతంలో హుండీల కానుకల ఆదాయం పోల్చుకుంటే ఈసారి సగం ఆదాయం తగ్గింది. కార్యక్రమంలో పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్ధబోయిన జగ్గారావు, ఇన్‌స్పెక్టర్ కవిత, సూపరింటెండెంట్ క్రాంతికుమార్, జూనియర్ అసిస్టెంట్లు రాజేశ్వర్‌రావు, జగదీశ్, మధు, వీరన్న, బాలకృష్ణ, పూజారులు సిద్ధబోయిన మునీందర్, కొక్కెర కృష్ణ, చందా రఘుపతి, కాక సారయ్య, కాక కిరణ్, గోవర్ధన్, సిద్ధబోయిన స్వామి, భోజరావు, దశరథం, రమేశ్ పాల్గొన్నారు.

రెండు వర్గాల మధ్య ఘర్షణ..

- తల్వార్‌తో వ్యక్తి వీరంగం
- ఒకరికి కత్తిపోట్లు, మరొకరికి తీవ్రగాయాలు
- మిల్స్‌కాలనీ పీఎస్ పరిధిలో ఘటన

ఖిలా వరంగల్: బొడ్రాయి ఉత్సవాలు ప్రశాంతంగా ముగిశాయి. ఇంటింటా బంధువుల సందడి నెలకొంది. ఈ క్రమంలో మంగళవారం అర్ధరాత్రి మద్యం మత్తులో యువత రోడ్డుపై చేరి హల్‌చల్ చేసింది. తనపై ఉమ్మి దూషించావంటూ ఓ వ్యక్తి ప్రశ్నించడంతో మొదలైన ఘర్షణ.. కత్తులతో దాడి చేసుకునే స్థాయికి చేరింది. ఈ సమయంలో ఓ వ్యక్తి సినీఫక్కీలో తల్వార్‌తో రోడ్డుపైకి చేరి దాడికి పాల్పడ్డాడు. ఇందులో ఒకరు తీవ్ర కత్తిపోట్లకు గురికాగా.. మరొకరు తీవ్రగాయాలపాలయ్యారు. దీంతో ఎంజీఎం తరలించారు. ఈ ఘటనపై రెండు వర్గాలు మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్‌లో పరస్పరం ఫిర్యాదు చేసుకోగా.. ఒకవైపు 8మంది, మరోవైపు 6గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెంకటరత్నం తెలిపారు.

టీఎస్ ఐసెట్ నిధుల దుర్వినియోగం?

- రూ.99.50 లక్షలకు ప్రతిపాదనలు..
- రూ 92.76 లక్షల నిధుల కేటాయింపు
- సొంత అకౌంట్‌లోకి నగదు బదిలీపై ఆరోపణలు



కేయూ క్యాంపస్: కేయూ నిర్వహించిన టీఎస్ ఐసెట్ 2024–25లో అవకతవకలు జరిగినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఐసెట్ కన్వీనర్‌గా కేయూలోని కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం ఆచార్యులు నర్సింహాచారిని రాష్ట్ర ఉన్నత విద్యామండలి నియమించింది. ఇందుకు రాష్ట్ర ఉన్నత విద్యామండలి కేటాయించిన నిధులు కొంత మేరకు దుర్వినియోగమయ్యాయనే ఆరోపణలు వస్తున్నాయి. విచారణ జరిపితే వాస్తవాలు వెలుగులోకి రానున్నాయి.

నిర్వహణకు భారీగా నిధులు

ఐసెట్ నిర్వహణ, తదితర ఖర్చుల కోసం ఐసెట్ కన్వీనర్ రూ.99.50 లక్షలు రాష్ట్ర ఉన్నత విద్యామండలికి ప్రతిపాదించారు. రూ.92.76 లక్షలు కేటాయింపు జరిగింది. అనంతరం కన్వీనర్ అకౌంట్‌లోకి దశలవారీగా నిధులు విడుదల చేసినట్లు సమాచారం. ఐసెట్ నిర్వహణ, పేపర్ సెట్టింగ్, ప్రశ్నపత్రాల రూపకల్పన తదితరాల కోసం ఆయా బిల్లులను కన్వీనర్ అకౌంట్‌లోని డబ్బుల నుంచే ఆన్‌లైన్‌లో లేదా చెక్కుల రూపంలో చెల్లించాలి. కేయూలోని ఐసెట్ కార్యాలయంలో ఇద్దరు తాత్కాలిక ఉద్యోగులు పని చేస్తున్నారు. వీరికి కూడా ప్రతినెల నిధుల నుంచే చెల్లించాల్సి ఉంటుంది.

వ్యక్తిగత ఖాతాలోకి రూ.29 లక్షలు

టీఎస్ ఐసెట్ కన్వీనర్ అకౌంట్‌లో నుంచి పలు దఫాలుగా సుమారు రూ.29.25 లక్షల వరకు తన వ్యక్తిగత ఖాతాలోకి (బ్యాంక్ అకౌంట్)కు బదిలీ చేసుకున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. కొంత మొత్తం సెల్ఫ్ చెక్కులతో విడుదల చేసుకున్నట్లు ఆరోపణలున్నాయి. అదేవిధంగా కన్వీనర్ అకౌంట్ నుంచి ఐసెట్ కార్యాలయంలో పని చేసే తాత్కాలిక ఉద్యోగి అకౌంట్‌లోకి పలు దఫాలుగా సుమారు రూ.11 లక్షల వరకు బదిలీ చేశారని ఆరోపణలున్నాయి. వర్సిటీలో పని చేయని ఓ మహిళ అకౌంట్‌లోకి సైతం రూ 82,600లు బదిలీ చేశారనే ఆరోపణలున్నాయి. కన్వీనర్ అకౌంట్‌లో నుంచే వ్యయాలకు వెచ్చించాల్సి ఉండగా.. వ్యక్తిగత బ్యాంకు ఖాతాలోకి బదిలీ చేయడంపై ఆంతర్యమేంటనే దానిపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పర్చేజ్ కమిటీ అప్రూవల్ లేకుండానే ఐదు కంప్యూటర్లు కొన్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. రూ 4.37 లక్షల వరకు వ్యయం చేశారని తెలుస్తోంది. కన్వీనర్‌గా రూ.13 వేలు మాత్రమే మిగులు చూపినట్లు తెలుస్తోంది.

ఉన్నత విద్యా మండలికి ఫిర్యాదు

ఐసెట్ నిర్వహణకు కేటాయించిన నిధుల్లో అవకతవకలు జరిగాయనే ఆరోపణలతో రాష్ట్ర ఉన్నత విద్యా మండలికి ఫిర్యాదు అందినట్లు సమాచారం. ఉన్నత విద్యామండలి టీఎస్ ఐసెట్ నిర్వహణకు సంబంధించి కేటాయించిన నిధులు ఎలా వెచ్చించారనేదానిపై విచారణ జరిపే అవకాశాలున్నట్లు తెలిసింది. ఉన్నత విద్యా మండలిలో సమర్పించిన బిల్లులు ఆడిట్ రిపోర్టు కూడా పరిశీలించనున్నట్లు సమాచారం.

అవకతవకలకు పాల్పడలేదు

టీఎస్ ఐసెట్–24 నిర్వహణకు రాష్ట్ర ఉన్నత విద్యామండలి నుంచి కేటాయించిన నిధుల్లో ఎలాంటి అవకతవకలకు పాల్పడలేదు. రాష్ట్ర ఉన్నత విద్యా మండలి కేటాయించిన నిధుల్లో నిర్వహణ వివిధ రకాలుగా వ్యయంతో పాటు కాన్ఫిడెన్షియల్ వ్యయం తన రెమ్యూనరేషన్ రూ.లక్ష 25 వేలు, గత వీసీకి రూ. 2 లక్షలు, అప్పటి ఉన్నత విద్యామండలి చైర్మన్‌కు రూ. 2 లక్షలు వైస్ చైర్మన్లకు ఇద్దరికి చేరో రూ. 2 లక్షల చొప్పున రెమ్యూనరేషన్ చెల్లించా. వ్యక్తిగత ఖాతాకు ఎందుకు బదిలీచేశానంటే కొన్ని రకాల ఖర్చులకు నగదు రూపంలో కూడా చెల్లించాల్సి వచ్చింది. నిధుల కేటాయింపులో చేసిన వ్యయంపై బిల్లులపై కూడా ఆడిట్ జరిగింది. అందుకు సంబంధించి బిల్లులు ఆడిట్ రిపోర్టును కూడా రాష్ట్ర ఉన్నత విద్యామండలికి ఇప్పటికే సమర్పించా.

– ఆచార్య నర్సింహాచారి, టీఎస్ఐసెట్ కన్వీనర్

చర్యలు తీసుకుంటాం

కేయూ ఐసెట్ కన్వీనర్‌కు రాష్ట్ర ఉన్నత విద్యా మండలి కేటాయించిన నిధుల వ్యయంపై ఉన్నత విద్యా మండలి బిల్లులను పరిశీలించాల్సి ఉంటుంది. ఈ వ్యవహారం నా పరిధిలో లేదు. నేను ఇటీవలే వీసీగా బాధ్యతలు స్వీకరించా. నిర్వహణ వ్యయంలో కన్వీనర్ ఏమైనా అవతవకలకు పాల్పిడినట్లు రాష్ట్ర ఉన్నత విద్యా మండలి తేల్చితే అప్పుడు నేను సంబంధిత కన్వీనర్‌గా ఉన్న ప్రొఫెసర్‌పై చర్యలు తీసుకుంటా.

– ప్రతాప్‌రెడ్డి, వీసీ, కాకతీయ యూనివర్సిటీ

దాతలు.. దయచూపండి

చేతులెత్తి వేడుకుంటున్న కమలమ్మ

- పోలియో బారిన పడిన మనవరాలు
- కష్టమవుతున్న కుటుంబ పోషణ
- పట్టించుకోని కుమారుడు.. ఇల్లు కూడా సరిగా లేని దుస్థితి
- గుడిసెలోనే కాలం వెళ్లదీస్తున్న వృద్ధురాలు
- దయార్థహృదయులు, ప్రభుత్వం పట్టించుకోవాలని విజ్ఞప్తి



పౌర్ణమి కుటుంబం, తను ఉంటున్న గుడిసె

గోవిందరావుపేట : అసలే పేద కుటుంబం.. ఆపై ఉండడానికి కూడా ఇల్లు లేని దుస్థితి. ఉన్న అర గుంట స్థలంలో చిన్న గుడిసె. ఆ గుడిసెలోనే కాలం వెళ్లదీస్తూ 30 సంవత్సరాలు కూలి పని చేసుకుంటూ కొడుకులను పోషించుకుంది. ఇద్దరు కొడుకులకు పెళ్లిళ్లు అయ్యాయి. ఇక్కడే విధి వెంటాడడం మొదలు పెట్టింది. చిన్న కొడుకుకు సంతానం కలిగిన తర్వాత కొద్ది రోజులకే చిన్న కోడలు చనిపోయింది. అప్పటికే ఆ దంపతులకు ఒక కుమారుడు, ఇద్దరు కూతుళ్లు. ఆ కూతుళ్లలో ఒకరు పుట్టుకతోనే పోలియో బారినపడింది. కొడుకు మద్యానికి బానిసయ్యాడు.. అది సరిపోదు అన్నట్లు అతడికి మూర్ఛ రోగం.. ఆ తల్లికి కూడా వయసు మీద పడింది. దీంతో కుటుంబ పోషణ కష్టతరంగా మారి దాతలు, ప్రభుత్వ సాయం కోసం వెయ్యి కళ్లతో ఎదురుచూస్తోంది. ఆ వృద్ధురాలే మండలంలోని చల్వాయికి చెందిన కార్పాటి కమలమ్మ. పోలియో బారిన పడిన చిన్నారి పేరు 'పౌర్ణమి'. ఆ చిన్నారికి పేరు తెలిసి పెట్టారో, తెలియక పెట్టారో తెలియదు కానీ పేరులో ఉన్న వెలుగు జీవితంలో లేదు.. వివరాల్లోకి వెళ్తే.. ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం చల్వాయికి చెందిన పౌర్ణమికి పుట్టినప్పుడే పోలియో వచ్చింది. కొద్ది రోజులకే తల్లి చనిపోయింది. తండ్రి తన బాధ్యత మరచి పోయాడు. దీంతో పౌర్ణమి మంచిచెడులను నానమ్మ కమలమ్మ, చెల్లి జ్యోతి చూసుకుంటోంది. అసలే వృద్ధురాలు.. ఆపై ఎలాంటి ఆసరా లేని దుస్థితి. ఫలితంగా పూట గడవడం కష్టతరంగా మారింది. అర్ధాకలితో కుటుంబం మొత్తం అలమటిస్తోంది.

వైద్య ఖర్చులకూ సరిపోని పింఛన్..

ఆ వృద్ధురాలికి వచ్చే ఆసరా పింఛన్ కుటుంబం పోషణ పక్కన పెడితే వైద్య ఖర్చులకూ సరిపోవడం లేదు. నెలనెలా పౌర్ణమి బాగోగులతోపాటు తన వైద్యానికి ఖర్చు చాలా అవుతోందని కమలమ్మ కన్నీరుమున్నీరవుతోంది. కమలమ్మ గుడిసె చు ట్టూ చెట్లు, పొలాలు ఉన్నాయి. ఈ క్ర మంలో ఓ రోజు నిద్రిస్తున్న సమయంలో కమలమ్మను పాము కాటు వేసింది. వైద్యుడి వద్దకు వెళ్తామంటే చేతిలో చిల్లిగవ్వ లేకపోవడంతో నిర్లక్ష్యం చేసింది. దీంతో ఇన్‌ఫెక్షన్ అయ్యింది. చికిత్స చేయించుకుంటూ మందులు వాడుతోంది. ఫలితంగా వచ్చే పింఛన్ వైద్యానికే ఖర్చు చేస్తుడడంతో కుటుంబం గడవడం లేదు. దీనిపై దాతలు, ప్రభుత్వం స్పందించి ఆర్థిక సాయంతోపాటు ఇల్లు నిర్మించి ఇవ్వాలని ఆ వృద్ధురాలు చేయ్యెత్తి వేడుకుంటోంది. దాతలు, ప్రభుత్వం.. 6281288143 ఈనంబర్‌ను సంప్రదించి చేయూత ఇవ్వాలని కమలమ్మ విజ్ఞప్తి చేస్తున్నారు. కాగా, గత ప్రభుత్వంలో చల్వాయి గ్రామానికి 40 డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు మంజూరయ్యాయి. అయితే కమలమ్మ లాంటి పేదలకు ఇవ్వకుండా ఇప్పటికే ఇల్లు ఉన్నవారితోపాటు ప్రభుత్వ ఉద్యోగ కుటుంబాలకు డబుల్ ఇళ్లు కేటాయించారని పలువురు గ్రామస్తులు పేర్కొన్నారు.

గుండె తరుక్కుపోతోంది



కమలమ్మ కుటుంబాన్ని చూస్తే గుండె తరుక్కుపోతోంది. ఇల్లు లేదు. పౌర్ణమి పుట్టుకతోనే పోలియో బారిన పడింది. తల్లి చనిపోయింది. తండ్రికి మూర్ఛ రోగం. నానమ్మకు వయసు మీద పడింది. ఇలాంటి నిరుపేదలకు ప్రభుత్వం ఆదుకోవాలి. గత ప్రభుత్వంలో గ్రామంలో అనర్హులకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు మంజూరు చేశారు. ఈ ప్రభుత్వంలోనైనా ఈ కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలి.

–గణపాక సుధాకర్, చల్వాయి

ముగిసిన చదరంగం పోటీలు

వరంగల్ స్పోర్ట్స్: వరంగల్ చదరంగ సమాఖ్య ఆధ్వర్యంలో రెండ్రోజుల పాటు హనుమకొండలోని టీటీడీ కల్యాణ మండపంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి అండర్–15 బాలబాలికల చదరంగ పోటీలు బుధవారం ముగిశాయి. ముగింపు వేడుకలకు వరంగల్ చాంబర్ ఆఫ్ కామర్స్ కాటన్ ఇండస్ట్రీ ప్రెసిడెంట్ బొమ్మినేని రవీందర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు పతకాలు, సర్టిఫికెట్లు అందజేశారు. ఈసందర్భంగా రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ.. చిన్నప్పటి నుంచి పిల్లలకు చదరంగంలో శిక్షణ అందించేలా తల్లిదండ్రులు చొరవ చూపాలన్నారు. తద్వారా మానసికంగా, మేథో సంపత్తి పెంపొందుతుందన్నారు. టోర్నమెంట్ నిర్వహణ కార్యదర్శి పి.కన్నా మాట్లాడుతూ.. అండర్–15 విభాగంలో జరిగిన పోటీల్లో గెలుపొందిన విజేతల్లో బాలుర విభాగంలో తరాల యోహాన్ యాదవ్, ఆకుల ప్రణయ్, శ్రీరామ అంజనీకుమార్, చల్లా సహర్ష బాలికల విభాగంలో యాశ్విజైన్, గాదె శరణ్య, సముద్రాల సహర్ష, బోనాల శ్రీలాస్య ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు నవంబర్ 3 నుంచి 11వ తేదీ వరకు తమిళనాడులో జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. ముగింపు వేడుకల్లో చీఫ్ ఆర్బిటర్లు సాయి ప్రసాద్, శ్రీనివాస్, ప్రేమ్‌సాగర్, వైశాలి, క్రీడాకారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బాలికలు క్రీడల్లోనూ రాణించాలి

- హనుమకొండ కలెక్టర్ పి.ప్రావీణ్య
- ఉమ్మడి జిల్లా స్థాయి క్రీడా పోటీలు ప్రారంభం



క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

కమలాపూర్: బాలికలు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని హనుమకొండ కలెక్టర్ పి.ప్రావీణ్య అన్నారు. కమలాపూర్‌లోని మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలలో బుధవారం ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి ఎంజేపీ గురుకుల పాఠశాలల అండర్–17 బాలికల క్రీడా పోటీలను ఆమె ప్రారంభించారు. స్థానిక విద్యార్థినులు మార్చ్ ఫాస్ట్ నిర్వహించగా క్రీడాకారిణులతో కలెక్టర్ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మూడు రోజుల పాటు నిర్వహించే ఈ పోటీల్లో ఉమ్మడి జిల్లాలోని 18 పాఠశాలలకు చెందిన 630 మంది విద్యార్థినులు పాల్గొనడం సంతోషకరమని, అందరూ క్రీడా స్ఫూర్తిని చాటాలన్నారు. బాలికలు క్రీడల్లో రాణించేందుకు ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని, అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం క్రీడాకారిణులతో కలిసి వాలీబాల్ ఆడి వారిని ఉత్సాహపరిచారు. అంతకుముందు వరంగల్‌కు చెందిన విద్యార్థినులు యోగాసనాలతో ఆకట్టుకోగా, వర్ధన్నపేట, తిమ్మాపూర్, గాంధీనగర్‌కు చెందిన విద్యార్థినులు నృత్యాలతో అలరించారు. కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ డీడీ రాంరెడ్డి, తహసీల్దార్ సురేశ్, ఎంపీడీఓ గుండె బాబు, ఎంజేపీ గురుకుల పాఠశాలల జిల్లా కన్వీనర్ వెంకటప్రసాద్, ప్రిన్సిపాల్స్ సౌజన్య, రవీందర్, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా బస్సులు నడపాలి

- ఆర్టీసీ కరీంనగర్ ఈడీ, కార్పొరేషన్ కార్యదర్శి పీవీ మునిశేఖర్

హన్మకొండ: ప్రణాళికబద్ధంగా బస్సులు నడపాలని టీజీఎస్ ఆర్టీసీ కరీంనగర్ ఈడీ, కార్పొరేషన్ కార్యదర్శి పీవీ మునిశేఖర్ అధికారులకు సూచించారు. బుధవారం హనుమకొండలోని ఆర్టీసీ వరంగల్ రీజియన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కరీంనగర్ జోన్ పరిధి ఖమ్మం, వరంగల్, కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్ రీజినల్ మేనేజర్లు, డిప్యూటీ మేనేజర్ల సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. కరీంనగర్ జోన్ పరిధి ప్రతీ డిపో లాభాల్లో ఉండాలని, ఆ దిశగా అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు.

స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ సెంటర్ ప్రారంభం..



స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఈడీ మునిశేఖర్

ఆర్టీసీ ఉద్యోగులకు శిక్షణ ఇచ్చేందుకు వరంగల్ రీజియన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ సెంటర్‌ను రీజినల్ మేనేజర్ డి.విజయభానుతో కలిసి ఈడీ ప్రారంభించారు. సాంకేతిక మార్పులకు అనుగుణంగా శిక్షణ ఇచ్చేందుకు ఈ శిక్షణ కేంద్రం దోహదపడుతుందన్నారు.

ఆర్టీసీ ఐటీఐలో అత్యుత్తమ శిక్షణ

టీజీఎస్ ఆర్టీసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఐటీఐలో అత్యుత్తమ శిక్షణ ఇస్తున్నట్లు ఈడీ మునిశేఖర్ అన్నారు. వరంగల్ ములుగు రోడ్డులోని ఆర్టీసీ జోనల్ స్టాఫ్ ట్రైనింగ్ కళాశాలలో డీజిల్ మెకానిక్ కోర్సు పూర్తి చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేసి మాట్లాడారు. ఆర్టీసీ ఐటీఐలో డీజిల్ మెకానిక్ చదివిన 40 మంది విద్యార్థుల్లో 10 మందికి ప్రధానమైన కంపెనీల్లో ప్లేస్‌మెంట్ లభించిందన్నారు. వరంగల్ రీజనల్ మేనేజర్ డి.విజయభాను, కరీంనగర్ ఆర్ఎం సుచరిత, ఖమ్మం ఆర్ఎం సరిరాంనాయక్, ఆదిలాబాద్ ఆర్ఎం సాల్మన్, నిజామాబాద్ ఆర్ఎం జాన్‌రెడ్డి, వరంగల్ రీజియన్ డిప్యూటీ ఆర్ఎంలు కేశారాజు భానుకిరణ్, మాధవరావు, అకౌంట్స్ మేనేజర్ రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

బొగ్గు వ్యాగన్‌లో పొగలు

- ఉప్పల్‌లో నిలిపి ఆర్పివేత



ఫైరింజన్‌తో పొగలు ఆర్పివేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

కమలాపూర్: బొగ్గు తరలిస్తున్న గూడ్స్ రైల్లోని ఓ వ్యాగన్‌లో బుధవారం పొగలు రావడంతో రైలును హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలంలోని ఉప్పల్ రైల్వేస్టేషన్‌లో నిలిపి వేసి ఫైరింజన్ సాయంతో ఆర్పివేశారు. స్థానికుల కథనం ప్రకారం.. మందమర్రి నుంచి కర్ణాటకకు గూడ్స్ రైలులో బొగ్గు తరలిస్తుండగా మార్గమధ్యన పొత్కపల్లి రైల్వేస్టేషన్ దాటగానే వ్యాగన్‌లో పొగలు రావడాన్ని డ్రైవర్, గార్డు గమనించారు. గూడ్స్ రైలు ఉప్పల్ వద్దకు రాగానే ఆ పొగలు కాస్త ఎక్కువ కావడంతో రైల్వే అధికారులకు తెలియజేసి వారి సూచనల మేరకు రైలును ఉప్పల్ రైల్వే స్టేషన్‌లో నిలిపివేశారు. ఫైరింజన్‌కు సమాచారం ఇవ్వడంతో హుజూరాబాద్ నుంచి అగ్నిమాపక సిబ్బంది శ్రీనివాస్, సందీప్, శివారెడ్డి, ప్రభాకర్ వచ్చి ఫైరింజన్ సాయంతో వ్యాగన్ నుంచి వస్తున్న పొగలను ఆర్పి వేశారు. గంట పాటు రైలును ఉప్పల్ స్టేషన్‌లోనే నిలిపి పొగలు రావడం లేదని నిర్ధారించుకున్న తర్వాత పంపించి వేశారు.

క్రికెట్ విజేత హనుమకొండ..

- ముగిసిన అండర్–23 లీగ్ కమ్ నాకౌట్ పోటీలు



ట్రోఫీ అందుకున్న హనుమకొండ జట్టుతో అసోసియేషన్ బాధ్యులు

వరంగల్ స్పోర్ట్స్: వరంగల్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నాలుగు రోజులు కొనసాగిన అండర్–23 ఆరు జిల్లాల స్థాయి లీగ్ కమ్ నాకౌట్ క్రికెట్ పోటీలు బుధవారం ముగిశాయి. హనుమకొండ రెడ్డిపురంలోని టీవీవీ సుఖాంత్ క్రీడా మైదానంలో నిర్వహించిన పోటీల్లో హనుమకొండ, మహబూబాబాద్ జట్లు ఫైనల్‌లో తలపడ్డాయి.టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న హనుమకొండ జట్టు నిర్ణీత 20 ఓవర్లకు గానూ 9వికెట్ల నష్టానికి 122 పరుగులను సాధించింది. అనంతరం బరిలోకి దిగిన మహబూబాబాద్ జట్టు 16 ఓవర్లను ఎదుర్కొని కేవలం 64 పరుగుల వద్ద అన్నీ వికెట్లు కోల్పోయి ఓటమి చవిచూసింది. ముగింపు వేడుకల్లో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి చాగంటి శ్రీనివాస్.. విజేతకు ట్రోఫీని అందజేసి మాట్లాడారు. నవంబర్‌లో జరిగే అండర్–23 అంతర్ జిల్లాల స్థాయి క్రికెట్ పోటీల్లో ఉమ్మడి వరంగల్ జిల్లా జట్టు ట్రోఫీని దక్కించుకోవాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి ఉపేందర్, కార్యవర్గ సభ్యులు తోట రాము, మట్టెడ కుమార్, మహబూబాబాద్ జిల్లా ఇన్‌చార్జ్ అజయ్ సారథి, వరంగల్ జిల్లా మాజీ కార్యదర్శి మార్నేని ఉదయభానురావు, బండారి ప్రభాకర్, వరంగల్ రంజీ క్రీడాకారుడు తోట సుఖాంత్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వే డివిజన్‌తోనే సమస్యల పరిష్కారం

- వరంగల్ ఎంపీ కావ్య, ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి
- నేడు రైల్వే జీఎంతో ఎంపీల సమావేశం



రైల్వే సమస్యలపై అధికారులతో మాట్లాడుతున్న ఎంపీ, ఎమ్మెల్యే

కాజీపేట రూరల్ : కాజీపేట జంక్షన్ రైల్వే డివిజన్ కేంద్రం అయితేనే.. రైల్వే సమస్యలన్నింటికీ పరిష్కారం లభిస్తుందని వరంగల్ ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. అయోధ్యపురం వద్ద జరుగుతున్న రైల్వే వ్యాగన్ పీఓహెచ్ షెడ్‌ను బుధవారం సందర్శించి నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం కాజీపేట జంక్షన్‌కు చేరుకుని రైల్వే సమస్యలపై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ కాజీపేటలో రైల్వే ప్లాట్‌ఫామ్‌ల సంఖ్య పెంచాలని, ఫుట్‌ఓవర్ బ్రిడ్జి నిర్మించాలన్నారు. నష్కల్–హసన్‌పర్తి వరకు ధర్మసాగర్ బైపాస్‌లైన్ పరిశీలనలో ఉందని, రైతుల భూమిలో నుంచి రైల్వే లైన్ వెళ్తే పరిహారం వచ్చేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కాజీపేట జంక్షన్ పరిధిలో నెలకొన్న రైల్వే సమస్యలను గురువారం సికింద్రాబాద్‌లో రైల్వే జనరల్ మేనేజర్‌తో జరిగే ఎంపీల భేటీలో ప్రస్తావించి పరిష్కారం అయ్యేందుకు కృషి చేస్తామన్నారు. నెల రోజుల్లో కాజీపేట ఫాతిమా బ్రిడ్జి నిర్మాణ పనులు మొదలు పెట్టి ఫిబ్రవరిలో ప్రారంభించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. రైల్వే అధికారులు బద్దియ, రామకృష్ణ రాజు, విజయ్‌కుమార్, సజ్జన్‌లాల్, రాజేశ్, మౌనిక, కార్పొరేటర్లు జక్కుల రవీందర్‌యాదవ్, విజయశ్రీరజాలి, మాజీ కార్పొరేటర్లు అబుబక్కర్, గుంటి కుమార్, నాయకులు అజ్గర్, సిరిల్ పాల్గొన్నారు.

టెక్నాలజీ కోర్సుల్లో శిక్షణ

మహబూబాబాద్ అర్బన్: జిల్లాలోని గిరిజన బాల, బాలికలకు వివిధ టెక్నాలజీ కోర్సుల్లో ప్రత్యేక శిక్షణతో పాటు ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నట్లు జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి సైదామాలోత్ బుధవారం తెలిపారు. ఐటీడీఏ ఏటూరునాగరం ఆధ్వర్యంలో ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని పదో తరగతి పాస్ అయిన గిరిజన విద్యార్థులకు అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్‌లో 2024– 25 విద్యా సంవత్సరానికి గాను మ్యానుఫాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్, ఆటోమేషన్, ఇండస్ట్రియల్ రోబోటిక్స్, డీజిల్ మ్యానుఫాక్చరింగ్ టెక్నీషియన్, ఆర్టిజన్ యుజింగ్ అడ్వాన్స్‌డ్ టూల్స్, బేసిక్ డిజైనర్, వర్చుల్ వెరిఫైర్, అడ్వాన్స్‌డ్ సియన్‌సి మిషనింగ్ టెక్నీషియన్, మెకానిక్ ఎలక్ట్రిక్ వెహికల్స్, తదితర కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నారు. ఈ నెల 25న జిల్లా కేంద్రంలోని గిరిజన భవనంలో, 26న ములుగు జిల్లా గిరిజన భవనంలో ప్రవేశాలకు ఎంపిక ఉంటుందన్నారు. శిక్షణ తర్వాత టాటా కంపెనీలో ఉపాధి అవకాశాలు కల్పిస్తారని, ఆసక్తి గల గిరిజన బాల, బాలికలు పదో తరగతి పాస్ మెమో, కుల ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ కార్డు, టీసీ, ఒరిజినల్, జిరాక్స్ ప్రతులతో హాజరుకావాలన్నారు. వివరాలకు జిల్లా గిరిజన సంక్షేమ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.


అనుమతి లేకుండా విక్రయిస్తున్న టపాసుల పట్టివేత



టపాసులను స్వాధీనం చేసుకున్న పోలీసులు

మడికొండ: అనుమతి లేకుండా విక్రయిస్తున్న దీపావళి టపాసులను టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ కథనం ప్రకారం.. దీపావళి టపాసులు అక్రమంగా విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ పోలీసులు బుధవారం మడికొండకు చెందిన దొంతుల సంపత్‌కుమార్, కుమ్మరిగూడేనికి చెందిన పాడెం వినయ్‌కుమార్ షాపులపై దాడి చేశారు. ఇందులో సంపత్ కుమార్ వద్ద సుమారు రూ. 1,48, 812 విలువైన టపాసులు, వినయ్‌కుమార్ వద్ద రూ.3,31,460 విలువైన టపాసులు స్వాధీనం చేసుకున్నారు. విచారణ నిమిత్తం మడికొండ పోలీసులకు అప్పగించినట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మడికొండ ఎస్సై రాజబాబు తెలిపారు.

రామ్‌రాజ్ కాటన్ 'షోరూం' ప్రారంభం



రామ్‌రాజ్ షోరూం ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, దొంతి మాధవరెడ్డి , షోరూం నిర్వాహకులు

హన్మకొండ చౌరస్తా: హనుమకొండ చౌరస్తాలో ఏర్పాటు చేసిన రామ్‌రాజ్ కాటన్ షోరూంను బుధవారం వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి.. నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డితో కలిసి ప్రారంభించారు. షోరూం ప్రారంభమవగానే మొదటి కస్టమర్‌గా ప్రముఖ వ్యాపారి కాసం ఓం నమఃశివాయ.. రామ్‌రాజ్ దుస్తులు కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా రామ్‌రాజ్ కాటన్ షోరూం జీఎం సతీంద్రన్ నాయర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోనే హనుమకొండ చౌరస్తా షోరూం పెద్దదని, వివాహాది శుభకార్యాలకు సంప్రదాయ వస్త్రాలకు పెట్టింది పేరుగా ఈ షోరూం నిలుస్తుందన్నారు. దక్షిణ భారతదేశంలోనే అత్యంత ప్రజాదరణ కలిగిందన్నారు. కార్యక్రమంలో షోరూం నిర్వాహకులు ముప్పిడి విజయ్‌కుమార్‌రెడ్డి, రాంసహాయం హరీశ్‌రెడ్డి పాల్గొన్నారు.